క్లుప్తంగా

ఘనంగా ప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్ల

గోళ్ళపాడు(ముప్పాళ్ళ): మండలంలోని గోళ్ళపాడు గ్రామంలోని ప్రసన్నాంజనేయస్వామి వార్షిక తిరునాళ్ల మహోత్సవం ఘనంగా జరుగుతోంది. శనివారం అన్నదానం నిర్వహించారు. స్వామి వారికి నవ కలశ స్నపన, పంచామృత స్నపన, హనుమత్ వ్రతం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. సాయంత్రం నరసరావుపేటకు చెందిన శ్రీవెంకటేశ్వర సేవా సమాజం విష్ణు సహస్ర నామ గానామృతం చేపట్టింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకొన్నారు.

రేషన్ పంపిణీలో ఆరోపణలు సహించేది లేదు

క్రోసూరు: మండలంలోని డీలర్లు, ఎండీయూ నిర్వాహకులు ప్రజలకు రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ డి.శ్రీనివాసరరావు సూచించారు. శనివారం రేషన్ డీలర్లు, ఎండీయూ నిర్వాహకులతో ఆయన సమీక్ష, సమావేశం నిర్వహించారు. ఇంటింటికీ రేషన్ పంపిణీలో ఆరోపణలొస్తే.. సహించేది లేదన్నారు. ఈ సందర్భంగా రేషన్ డీలర్లు తమ కమీషన్ల గురించి అడిగారు. అనంతరం కొత్తగా వచ్చిన తహసీల్దార్‌ను డీలర్లు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని 43మంది రేషన్‌డీలర్లు, 13 మంది ఎండీయూ నిర్వహకులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగించుకోవాలి

సత్తెనపల్లి: స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేసే ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని కాకతీయ జనసేవ సమితి అధ్యక్షుడు యెల్లినేడి రామస్వామి పేర్కొన్నారు. పట్టణంలోని కాకతీయ కల్యాణ మండపంలో ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ వైద్య సిబ్బంది సత్తెనపల్లి కాకతీయ జనసేవ సమితి ఆధ్వర్యంలో శనివారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. నేత్ర వైద్యులు పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆదివారం కూడా ఉచిత శిబిరం కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సమితి కార్యదర్శి రావెల చంద్రశేఖర్, ప్రగతి విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ మక్కెన అచ్చయ్య, చల్లా రత్తయ్య, గద్దె మురహరి రావు తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించండి

పెదకూరపాడు: ప్రతి ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలల్లోకి తీసుకెళ్లాలని మండల పరిషత్ అధ్యక్షుడు బెల్లంకొండ మీరయ్య అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మీరయ్య శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. పెదకూరపాడులో నూతనంగా నిర్మిస్తున్న సీహెచ్‌సీ ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ షేక్ చాంద్ బాషా, బాలమేరి, ఎంపీడీఓ నరసింహరావు పాల్గొన్నారు.

గ్రంథాలయం తనిఖీ

రాజుపాలెం: మండలకేంద్రంలోని శాఖా గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవదానం, కార్యదర్శి కె.ఝాన్సీలక్ష్మి శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రంథాలయ అధికారి కేఎస్ఎస్ ప్రసాద్‌కు పలు సూచనలు చేశారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలి



బెల్లంకొండ: వేసవిలో తాగునీటి సమస్యలు లేకుండా అధికారులు గ్రామంల్లో చర్యలు చేపట్టాలని ఎంపీపీ చెన్నుపరెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా వివిధ శాఖల అధికారులు వారి శాఖల పనితీరును వివరించారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాలను అభివృద్ధి పథంలో నడపించడమే ధ్యేయంగా ప్రజా ప్రతినిధులు, అధికారులు పనిచేయాలని సూచించారు. గ్రామాల్లో పనిచేయకుండా ఉన్న బోర్లను గుర్తించి వాటికి మరమ్మతులు చేయించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ బ్రహ్మయ్య, తహసీల్దారు నిర్మల, ఈఓపీఆర్డీ వెంకటరెడ్డి, ఉప ఎంపీపీలు బూదాటి మరియమ్మ, ఎంపీటీసీలు మర్రి శ్రీనివాసరెడ్డి, మాదాసు రాంబాబు, చిట్టింశెట్టి శివనాగమణి, రేగులగడ్డ తిరుపతమ్మ, సర్పంచ్‌లు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు యథావిధిగా విద్యుత్ బిల్లుల చెల్లింపు

సత్తెనపల్లి: పట్టణంలోని రఘురాంనగర్ ఈఆర్వో కార్యాలయంలో ఆదివారం విద్యుత్ బిల్లుల చెల్లింపు కౌంటర్ యథావిధిగా పనిచేస్తుందని విద్యుత్ శాఖ పట్టణ ఏఈ పి.రవికిరణ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. విద్యుత్ సమస్యలకు సత్తెనపల్లి పట్టణ ఫ్యూజ్ ఆఫ్ కాల్ నంబర్ 9494116238 సంప్రదించాలని తెలిపారు.

46 ఏళ్లకు దళితులకు దక్కిన గౌరవం

- మొట్టమొదటి సారి ఎస్సీ సామాజిక వర్గానికి సత్తెనపల్లి ఏఎంసీ చైర్మన్ పదవి
- బాధ్యతలు చేపట్టనున్న సీనియర్ న్యాయవాది పెండెం బాబూరావు
- నేడు 13వ పాలకవర్గం ప్రమాణ స్వీకారం





సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

సత్తెనపల్లి: పల్నాడు ముఖ ద్వారమైన సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పీఠం ఎస్సీ సామాజిక వర్గానికి ఖరారైంది. ఆదివారం నూతన పాలకవర్గం కొలువు తీరనుంది. ప్రతిష్ఠాత్మకమైన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ స్థానాన్ని మొట్టమొదటిసారి దళితులకు కేటాయించి సామాజిక న్యాయం అంటే ఏమిటో మాటల్లో కాకుండా..చేతల్లో చూపించారు రాష్ట్ర జలవనుల శాఖ మంత్రి అంబటి రాంబాబు. కీలకమైన పదవులపై ఎంతో మంది ఆశలు పెట్టుకున్నప్పటికీ అన్ని వర్గాలకు సామాజిక న్యాయం దక్కాల్సిందేనని ఆయన పట్టుబట్టారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవిర్భావం తర్వాత ఇప్పటి వరకు 12సార్లు పాలకవర్గాల నియామకాలు జరిగితే ఓసీ కమ్మ సామాజిక వర్గం 7 సార్లు, రెడ్డి సామాజిక వర్గం 2 సార్లు, కాపు సామాజిక వర్గం రెండు సార్లు, ముస్లి మైనార్టీలకు ఒకసారి అవకాశం లభించింది. 46 ఏళ్ల తురువాత మొట్టమొదటి సారిగా సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా దళితులకు అవకాశం లభించింది. విద్యావంతుడైన దళితుడు, సీనియర్ న్యాయవాది పెండెం బాబురావు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పీఠాన్ని అధిష్టించనున్నారు.

ఏటా రూ.3.5 కోట్ల ఆదాయం

సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డ్ 1976లో ఏర్పడి.. 3.89 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. దీని పరిధిలో సత్తనపల్లి టౌన్, సత్తెనపల్లి రూరల్, ముప్పాళ్ళ మండలాలు ఉన్నాయి. ప్రధానంగా వ్యవసాయ ఉత్పత్తులైన పత్తి, ధాన్యం, మొక్కజొన్న, అపరాలు తదితర వ్యవసాయ ఉత్పత్తుల నుంచి ఒక శాతాన్ని సెస్ కింద మార్కెట్ కమిటీ సిబ్బంది చెక్‌పోస్టుల ద్వారా వసూలు చేస్తున్నారు. 2022 –23 ఆర్థిక సంవత్సరానికి ఏఎంసీ రూ.3.5 కోట్లు లక్ష్యంగా పెట్టుకుంది. ఏఎంసీ తొలి చైర్మన్‌గా 1977లో వద్దుల కోటిరెడ్డి (పెదమక్కెన) ప్రమాణ స్వీకారం చేయగా.. 2020 లో రాయపాటి పురుషోత్తమరావు(ధూళ్ళిపాళ్ల) చైర్మన్‌గా వ్యవహరించారు. ప్రస్తుతం 13వ చైర్మన్‌గా ఎస్సీ సమాజిక వర్గానికి పెండెం బాబూరావుకు ప్రమాణస్వీకారం చేయనున్నారు.

నేడు 13వ పాలకవర్గ ప్రమాణ స్వీకారం..

సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ 13వ పాలకవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం సాయంత్రం 4 గంటలకు పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో జరగనుంది. వ్యవసాయ మార్కెట్ కమిటీ గౌరవ చైర్మన్‌గా స్థానిక శాసనసభ్యుడు, రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, చైర్మన్‌గా పెండెం బాబూరావు (సత్తెనపల్లిటౌన్), వైస్ చైర్మన్‌గా ముప్పాళ్ళ మండలం దమ్మాలపాడు గ్రామానికి చెందిన కళ్ళం శివ రామిరెడ్డి, డైరెక్టర్లుగా షేక్ మస్తాన్‌బీ (సత్తెనపల్లి), దుగ్గెంపూడి రఘురామిరెడ్డి(పెదమక్కెన), ఆళ్ల జగన్నాథం(నందిగామ), కామినేని వెంకటప్పయ్య (ధూళ్ళిపాళ్ల), గంగూరు విజయలక్ష్మి(గుజ్జర్లపూడి), మారుబోయిన మల్లమ్మ (కంకణా లపల్లి), బత్తుల వెంకాయమ్మ (కుందురువారిపాలెం), మేడా సామ్రాజ్యం (చాగంటివారి పాలెం), ప్రత్తి అప్పారావు (గోళ్ళపాడు), గొర్రెపాటి వైడూర్య (రుద్రవరం), దేవర శెట్టి రవికుమార్ (సత్తెనపల్లి), బచ్చు వరలక్ష్మి (సత్తెనపల్లి), షేక్ జానమ్మ (సత్తెనపల్లి)తో పాటు మున్సిపల్ చైర్ పర్సన్ చల్లంచర్ల లక్ష్మీ తులసి, మార్కెటింగ్, వ్యవసాయ శాఖ ఏడీలు, ముప్పాళ్ళ పీఏసీఎస్ అధ్యక్షులను నియమించారు. వీరంతా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. మాజీ మంత్రులు కొడాలి నాని, డొక్కా మాణిక్య వరప్రసాద్, ఎంపీ శ్రీకృష్ణదేవరాయులు, ముఖ్య నాయకులు హాజరుకానున్నారు.

ప్రతి కుటుంబానికి సంక్షేమ తోడ్పాటు

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే నంబూరు



మహిళకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అచ్చంపేట: ప్రతి కుటుంబానికి ప్రభుత్వం సంక్షేమ తోడ్పాటు అందిస్తోందని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పేర్కొన్నారు. అచ్చంపేట సచివాలయం-1 లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు గడప గడపకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పనులను వివరించి, వారికి బుక్‌లెట్ అందించారు. స్థానికులు చెప్పిన సమస్యలకు అక్కడికక్కడే పరిష్కార మార్గాలు చూపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మూడున్నరేళ్లలో పెదకూరపాడు నియోజకవర్గం ఊహకు అందని రీతిలో అభివృద్ధి చెందిందన్నారు. అచ్చంపేటలో రూ.1.5కోట్లతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కేజీబీవీ, జడ్పీ పాఠశాల, రెసిడెన్షియల్ పాఠశాలలను రూ.5.30 కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. నాడు– నేడు పథకం కింద రూ.2.90 కోట్లతో పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించినట్లు తెలిపారు. గ్రామంలో రెండు సచివాలయ భవనాలు, కమ్యూనిటీ హాల్‌లు, వెల్‌నెస్ సెంటర్లు నిర్మించినట్లు గుర్తుచేశారు. సత్తెమ్మతల్లి ఆలయ అభివృద్ధికి అటవీ శాఖ అనుమతులు తీసుకొచ్చి, పనులు జరిపించినట్లు గుర్తుచేశారు. గత పాలకులు మాటలతో మాయ చేస్తే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తోందన్నారు. సీఎం వైఎస్ జగన్ ఆలోచనలను తాను అచరిస్తున్నట్లు తెలిపారు. ఎంపీపీ భూక్యా రజిని నాయక్, జడ్పీటీసీ తుమ్మా విజయప్రతాప్ రెడ్డి, సర్పంచ్ కంభాల వీర బాబు, సాయిరెడ్డి, వ్యవసాయ యూనివర్శిటీ మాజీ డైరెక్టర్ నెల్లూరి చంద్రబాబు, మండల పార్టీ కన్వీనర్ చిలక చంద్రయ్య, అంబటి నారయణ, చిన్న యల మందయ్య, సందెపోగు పున్నారావు, రామశెట్టి రంగయ్య తదితరులు ఉన్నారు.

తొలిధాన్యం.. అమ్మకు పొంగళ్ల నైవేద్యం

నేడు అంకమ్మతల్లి తిరుణాళ్ల



మూల విరాట్ అంకమ్మతల్లి

రాజుపాలెం: రాజుపాలెం అంకమ్మతల్లి తిరునాళ్ల ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి, భక్తుల పాలిట కొంగుబంగారం ఆదిపరాశక్తికి ఏటా ఫిబ్రవరి ఆఖరి ఆదివారం తిరునాళ్లను అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. పాడిపంటలు, భోగ భాగ్యాలతో చల్లగా చూసే తల్లికి కులమతాలకతీతంగా తొలి ధాన్యపు కంకుల పొంగళ్లు నైవేద్యంగా సమర్పిస్తారు. చీర, సారెలు సమర్పించి, మొక్కులు తీర్చుకుంటారు. మహిళలు ఊరేగింపుగా అమ్మవారికి బోణాలు సమర్పిస్తారు. గ్రామాలలో ఏకార్యక్రమం చేయాలన్నా ముందుగా అమ్మవారికి మొక్కులు తీర్చడం ఆనవాయితీ. సాయంత్రం నాలుగు గంటల నుంచి విద్యుత్ ప్రభలు, కోలాటాలు, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఉత్సవాలతో రాత్రంతా జాగారం చేస్తారు. ఈ ఏడాది ఉత్సవాలను ఎంతో వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లను సిద్ధం చేశారు. దేవాలయాన్ని వివిధ రంగులతో ముస్తాబు చేసి, విద్యుత్ దీపాలతో అలంకరించారు. అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని అర్చకులు అర్వపల్లి కోటినారాయణమూర్తి తెలిపారు. తిరుణాళ్లలో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఎస్‌ఐ ఎస్కే షఫీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ప్రభలపై రాజకీయ పార్టీల జెండాలు, సినీ హీరోల చిత్రాలు, ఫ్లెక్సీలు ప్రదర్శిస్తే నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

చల్లగుండ్లలో 'వైఎస్సార్ పొలంబడి'

నకరికల్లు: వరిలో యూరియా, పొటాష్, భాస్వరం వినియోగిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని సహాయ వ్యవసాయ సంచాలకులు బి.శ్రీకృష్ణదేవరాయలు సూచించారు. మండలంలోని చల్లగుండ్ల గ్రామంలో డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురుగు మందులు విచక్షణారహితంగా వినియోగిస్తే భూమిలో పోషకాలు కోల్పోవడమే కాక, ఉత్పత్తులో క్రిమిసంహారకాలు కలుస్తాయన్నారు. ప్రస్తుతం వరిలో జింక్‌లోపం కన్పిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు కె.దిలీప్‌కుమార్, కె.రవిబాబు రైతులు పాల్గొన్నారు.

అనాథ వృద్ధులకు ఉచితంగా న్యాయ సహాయం

సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జి నాగవెంకటలక్ష్మి



వృద్ధులతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి నాగవెంకటలక్ష్మి

సత్తెనపల్లి: అనాథ వృద్ధులకు ఉచితంగా న్యాయ సహాయం అందిస్తామని సత్తెనపల్లి మండల న్యాయసేవాధికార కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి డి.నాగ వెంకటలక్ష్మి పేర్కొన్నారు. పట్టణంలోని ఆదరణ అనాథ వృద్ధుల ఆశ్రమాన్ని శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆశ్రమంలోని వారికి సంతానం ఉన్నారా..? వారే పంపించారా లేక.. నిరాదరణ వల్ల వచ్చారా..? అని అందరినీ అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్‌ను పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాదులు దివ్వెల శ్రీనివాసరావు, బీఎల్.లక్ష్మి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ.. 'ఉపాధి' సిబ్బంది బాధ్యత

పల్నాడు జిల్లా డ్వామా పీడీ జోసఫ్‌కుమార్

బెల్లంకొండ: గ్రామాల్లో నాటిన మొక్కల సంరక్షణ బాధ్యత ఉపాధి హామీ సిబ్బంది తీసుకోవాలని పల్నాడు జిల్లా డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ 14వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదికను నిర్వహించారు. 2021-2022 వరకు జరిగిన పనులపై సామాజిక తనిఖీ చేపట్టారు. గ్రామాలలో ఉపాధి హామీ పథకంలో నాటిన మొక్కలు అధిక శాతం చనిపోవడంతో సిబ్బందిపై పీడీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏటా ఒక్కో సిబ్బంది వంద మొక్కలు బ్రతికించే విధంగా భాధ్యత తీసుకోవాలన్నారు. పనులకు రికార్డులు చూపించని వారికి, పండ్ల తోటల పెంపకంలో భాగంగా మొక్కలు తక్కువగా ఉన్న సిబ్బందికి మొత్తం రూ.12 వేలను రికవరీ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చన్నపరెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి, ఎంపీడీఓ బ్రహ్మయ్య, ఏపీఓ కోటమ్మ, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

బాలల రక్షణ ప్రతి ఒక్కరి కర్తవ్యం



విద్యార్థినులతో మాట్లాడుతున్న సీఐ సుభాషిణి

గోళ్ళపాడు(ముప్పాళ్ళ): చిన్న పిల్లలు దైవంతో సమానమని, వారికి రక్షణ కల్పించడం తమ కర్తవ్యమని దిశ పోలీస్‌స్టేషన్ సీఐ సుభాషిణి పేర్కొన్నారు. మండలంలోని గోళ్ళపాడు కేజీబీవీ, ముప్పాళ్ళ జడ్పీ, మాదల బీసీ గురుకుల పాఠశాలల్లో పోలీసు, జిల్లా మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం సంయుక్త ఆధ్వర్యంలో బాల, బాలికలపై జరిగే నేరాలు, వాటికి అమలయ్యే శిక్షల గురించి శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చిన్న పిల్లలు చేత వెట్టి చాకిరి చేయించడం, బాల్య వివాహాలు నేరమని వివరించారు. తమ చుట్టు పక్కల పరిసరాలను గమనించుకోగలిగే జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని, ప్రమాదాన్ని పసిగట్టి ఉపాధ్యాయులకు, పెద్దలకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దిశ ఎస్సై సుబ్బారావు, ఏహెచ్‌టీయూ విభాగం ఎస్సై అల్లూరిరెడ్డి, పాఠశాల సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ధైర్యంగా వివరించండి

గృహ సారథుల సమావేశంలో ఎమ్మెల్యే నంబూరు



గృహసారథుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

బెల్లంకొండ: రాజకీయాలకతీతంగా, కులాలు, మతాలు, పార్టీలు చూడకుండా అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీనేనని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పేర్కొన్నారు. శనివారం మండంలోని చంద్రాజుపాలెం గ్రామంలోని ఎస్ఎస్ కన్వెన్షన్ హాల్‌లో వలంటీర్లు, వైయస్సార్ సీపీ గృహ సారథుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకరరావు మాట్లాడుతూ ప్రతీ గడపకు ధైర్యంగా వెళ్లి ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు వైఎస్సార్ సీపీ పాలన గురించి ధైర్యంగా చెప్పుకోగలిగేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలన సాగిస్తున్నారని కొనియాడారు. అంతే ధైర్యంగా.. ప్రభుత్వ అభివృద్ధిని, సంక్షేమ పథకాలను వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు ప్రజల వద్దకు వివరించాలని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో ప్రజలను ఏ విధంగా మోసం చేశారో... ఈ ప్రభుత్వంలో ప్రజలకు చేసిన మేలును క్షుణ్ణంగా వివరించాలని దిశానిర్దేశం చేశారు. రాబోయే ఎన్నికలలో పెదకూరపాడు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగిరే విధంగా పనిచేయాలని స్పష్టం చేశారు. గత ఎమ్మెల్యే సొంత గ్రామానికి కూడా చేయలేని అభివృద్ధి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో చేశామని తెలిపారు. మార్చి 18 నుంచి వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని కోరారు. ప్రతి ఒక్కరితో మా నమ్మకం..నువ్వే జగన్.. అనేలా వారికి కలిగిన లబ్ధిని వివరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చన్నపరెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు ఓర్సు సాంబశివరావు, మండల సచివాలయ కన్వీనర్ గాదె మిల్లు వెంకటరెడ్డి, పార్టీ నాయకులు చింతారెడ్డి సాయిరెడ్డి, మర్రి ప్రసాదరెడ్డి, భద్రయ్య, అన్నపరెడ్డి నర్సిరెడ్డి, వైస్ ఎంపీపీ బూదాటి మరియదాసు, దరియా, సర్పంచ్‌లు బాబూజీ, పాప, రమణారెడ్డి, సైదయ్య, మేకల సోమయ్య, లక్ష్మీనారాయణ, శేషిరెడ్డి, బ్రహ్మం, ఎంపీటీసీలు రాంబాబు, మర్రి శ్రీనివాసరెడ్డి, శివనాగమణి, కందిపాడు శ్రీను వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

తహసీల్దారు నగేష్‌పై పోలీస్టేషన్‌లో వీఆర్ఏ ఫిర్యాదు

సత్తెనపల్లి: సత్తెనపల్లి తహసీల్దార్ కె.నగేష్‌పై కొమెరపూడి గ్రామ వీఆర్ఏ కొరబండి శ్రీనివాసరావు శనివారం పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ నెల 24న గ్రామంలో విధులు నిర్వహిస్తున్న సమయంలో తహసీల్దార్ కార్యాలయం వద్దకు రావాలని తనకు సమాచారం వచ్చిందన్నారు. సాయంత్రం 6 గంటలకు కార్యాలయానికి వెళ్లగా తహసీల్దార్ నగేష్ ఆవేశంతో ఊగిపోతూ ఏంరా అని చెంపపై కొట్టాడని, తాను ఎప్పుడు రమ్మన్నాను, ఎప్పుడొచ్చావు అంటూ నానా దుర్భాషలాడారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ గ్రామానికి ఆటోలు తప్ప.. బస్సులు లేవని, అందువల్లే తాను సమయానికి రాలేకపోయానని తెలిపారు. తాను పక్షవాతంతో బాధపడుతున్నా అకారణంగా కొట్టిన తహసీల్దార్ నగేష్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, న్యాయం చేయాలని కోరారు. దీనిపై తహసీల్దార్ నగేష్‌ను సంప్రదించగా ఫేస్ రికగ్నైజేషన్ యాప్‌లో హాజరు పెండింగ్ ఉండడంతో వేయించుకోవాలని మూడు రోజులుగా సమాచారం పంపుతున్నప్పటికీ వీఆర్ఏ రాలేదని తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం మనిషిని పంపగా సాయంత్రం వరకు రాలేదన్నారు. కేవలం తన ఒక్కడి హాజరు పెండింగ్ ఉండడం వల్ల ఇబ్బంది అవుతుందని మందలించడంతో దాన్ని సాకుగా తీసుకొని తాను కొట్టినట్లు చెబుతున్నాడని చెప్పారు. తాను కొట్టలేదని దీని వెనుక ఎవరో కథ నడుపుతున్నట్లు అనుమానం వ్యక్తం చేశారు. పట్టణ సీఐ యు.శోభన్ బాబును సంప్రదించగా కొమెరపూడి వీఆర్ఏ కొరబండి శ్రీనివాసరావు చేసిన ఫిర్యాదులో కులల ప్రస్తావన ఎక్కడా నమోదు చేయలేదని, అయినప్పటికీ దీని పై విచారణ జరుపుతున్నామన్నారు.

ఉద్యోగులపై దాడులను తీవ్రంగా ఖండించాలి


ఉద్యోగులపై దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని ఏపీ జేఏసీ చైర్మన్ పెండెం మణిరావు పేర్కొన్నారు. శనివారం సత్తెనపల్లి ఆర్డీఓ బీఎల్ఎన్ రాజకుమారిని కలిసి కొమెరపూడి వీఆర్ఏ కొరబండి శ్రీనివాసరావుపై తహసీల్దార్ నగేష్ దాడి చేయడాన్ని ఖండిస్తూ వినతిపత్రం అందించారు. క్రోసూరు యూనిట్ ప్రెసిడెంట్ బాషా, జేఏసీ సంఘ నాయకులు ప్రభుదాసు, అంబేడ్కర్, సత్యనారాయణ, వెస్లీ, ఇబ్రహీం, రవి తదితరులు ఉన్నారు. తహసీల్దార్ నగేష్ దాడిని వీఆర్ఏల సంఘం మండల నాయకులు ఖండించారు. గతంలోనూ ఆయన పని తీరుపై ఫిర్యాదులు ఉన్నాయని తెలిపారు.

ఎంఆర్ వ్యాక్సినేషన్ పరిశీలన

క్రోసూరు: మండలంలోని వెల్‌నెస్ సెంటర్లలో రెండో విడత మీజిల్ వ్యాక్సినేషన్ కార్యక్రమం జరిగింది. శనివారం ఆరోగ్యశాఖ సిబ్బంది మిగిలిన 45 మంది చిన్నారులకు వ్యాక్సిన్ వేశారు. పల్నాడు జిల్లా డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌ఓ జి.చంద్రశేఖర్ పీసపాడు, యర్రబాలెం వెల్‌నెస్ కేంద్రాలు, క్రోసూరు ప్రాథమిక కేంద్రాలల్లోని వ్యాక్సినేషన్ కార్యక్రమాలను పరిశీలించారు. అదేవిధంగా ఆయా కేంద్రాల్లోని ఏఎన్ఎం, ఆశ వర్కర్లతో మాట్లాడారు. ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు నిర్లక్ష్యం వహించకుండా విధులు నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా ఆయా వెల్‌నెస్ సెంటర్లల్లో రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఎంపీడీఓ పి.శివరామయ్య, సూపర్‌వైజర్ సీహెచ్ సాంబశివరావు, ఎంఎల్‌హెచ్‌పీ శివుడు, యూడీసీ బాషా పాల్గొన్నారు.

టీఎన్ నగర్ వాసులకు అండగా ఉంటాం

ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు, కలెక్టర్ శివశంకర్



మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్, పక్కన ఎంపీ శ్రీకృష్ణ దేవరాయులు

రాజుపాలెం: టీఎన్ నగర్‌లో జీవనోపాధి పొందుతూ నివాసముంటున్న 300 గృహాలకు ప్రభుత్వం ద్వారా పట్టాలు మంజూరు చేసే విధంగా తనవంతు కృషిచేస్తానని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు భరోసానిచ్చారు. కొండమోడు పరిధిలోని టీఎన్ నగర్ వాసులకు అటవీ శాఖ ద్వారా నోటీసులు పంపిణీ చేయగా.. కాలనీ వాసులు ఇటీవల స్పందనలో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ శనివారం గ్రామానికి చేరుకొని గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టీఎన్ నగర్ వాసులు మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా 300 కుటుంబాలకు చెందిన ఎస్టీలు, ఇతర నిరుపేదలు గృహాలు ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. అటవీశాఖ అధికారులు అర్ధంతరంగా నోటీసులు ఇస్తే తమ పరిస్థితి ఏంటని వాపోయారు. స్పందించిన ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ టీఎన్ నగర్ వాసులందరికీ అండగా ఉంటానన్నారు. పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ మాట్లాడుతూ ప్రస్తుతం నివాసముంటున్న వారు ఖాళీ చేయాల్సిన అవసరం లేదన్నారు. ఎస్టీలకు మాత్రమే అటవీభూములకు పట్టాలివ్వాలన్న నిబంధన ఉన్నప్పటికీ నిర్వాసితులు కాకుండా ఉండేందుకు ప్రభుత్వానికి నివేదిక అందజేసి పట్టాలిచ్చేందుకు కృషిచేస్తామని అన్నారు. డీఎఫ్ఓ రామచంద్రయ్య మాట్లాడుతూ.. రికార్డుల పరంగా అటవీశాఖ భూమిగా ఉన్నందున నోటీసులు అందజేశామని వాస్తవ పరిస్థితిని ప్రభుత్వానికి నివేదించి, టీఎన్ నగర్‌లో నివాసముంటున్న వారిని ఆదుకుంటామని చెప్పారు. మాజీ ఎంపీపీ బాసు లింగారెడ్డి, ఆర్డీఓ రాజకుమారి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి, తహసీల్దార్ ఎ.నళిని, జడ్పీటీసీ దొంతిరెడ్డి సునీత తదితరులు పాల్గొన్నారు.